క్లుప్తంగా

బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: బ్యూటీపార్లర్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం మహిళలకు బ్యూటీపార్లర్ మేనేజ్మెంట్ కిట్టు, సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు సంగారెడ్డి బైపాస్‌లోని ఆఫీసులో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9704446956, 9490129839 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి దర్గా ఉత్సవాలు



ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

మనూరు(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ షాదుల్లా హుస్సెని దర్గా ఉర్సు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7న గంధాల ఊరేగింపు, 8న జాతర, 9న దీపారాధన కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

హత్నూర(సంగారెడ్డి): మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. హత్నూరలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు తగిన సంఖ్యలో హాజరు కాకపోవడంతో సమావేశాన్ని గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శారదాదేవి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన సంఖ్యలో హాజరు కావడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమావేశానికి ఎంపీపీ నర్సింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ పండగ లక్ష్మీరవికుమార్, ఎంపీటీసీ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమలకు అండగా ఉంటాం



రమేశ్

వట్‌పల్లి(అందోల్): గొల్ల, కురుమలకు అండగా ఉంటామని గొల్ల, కురుమ సంఘం నాయకుడు రమేశ్ అన్నారు. దామోదర రాజనర్సింహకు ఓటేసిన గొల్ల, కురుమ సోదరులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల, కురుమలను పట్టించుకోలేదని, కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్‌ఎస్ నాయకులు అబద్ధాలు చెప్పి తప్పుడు ప్రచారం చేశారన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను నమ్మి గొల్ల, కురుమలు కాంగ్రెస్ వైపు నిలిచారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా గొల్ల, కురుమ సోదరులకు కాంగ్రెస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని హామీనిచ్చారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వీలైనంత త్వరలో పరిష్కరించాలని సూచించారు. పలు కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్య, విద్యుత్, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో పోషకాలు

- రసాయన ఎరువుల వినియోగంతో అనార్థాలు
- సారం కోల్పోతున్న వ్యవసాయ భూములు
- వర్మీ కంపోస్ట్ వినియోగంతో తెగుళ్లకు అడ్డుకట్ట
- సేంద్రియ సాగుతో సంపూర్ణ ఆరోగ్యమంటున్న అధికారులు



వర్మీ కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

సంగారెడ్డి టౌన్: సేంద్రియ సాగుతో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా మేలు చేస్తాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అదేవిధంగా రసాయన ఎరువులతో పండించినవి తీసుకుంటే అనారోగ్యానికి గురికాక తప్పదని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసాద్ హెచ్చరిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయంలో వర్మీ కంపోస్ట్, వానపాముల ఎరువు వాడితే రసాయన ఎరువులు వాడనసరం లేదు. రైతుకు ఖర్చు తగ్గడంతో పాటు రసాయన రహిత పంటలు పండించవచ్చని అధికారులు సూచనలు చేస్తున్నారు.

వర్మీ కంపోస్టు బెడ్స్ తయారీ విధానం

- మూడు అడుగుల వెడల్పుతో తూర్పు, పడమర దిశలో మనకు కావాల్సినంత పొడవులో బెడ్లను ఏర్పాటు చేసుకోవాలి.
- వర్మి బెడ్ల అడుగు భాగం గట్టిగా వుండేటట్లు చూసుకోవాలి.
- సిమెంట్ లేదా పేడతో గట్టి పరుచుకోవాలి. వర్మీ బెడ్ ఎత్తు సుమారు నేల నుంచి 3 అడుగులు లేదా 100 సెంటీమీటర్లు ఉండేటట్లు చూసుకోవాలి.
- పాలిథిన్ షీట్స్‌తో తయారుచేసిన వర్మి కంపోస్ట్ బెడ్స్ కూడా మార్కెట్లో దొరుకుతున్నవి.
- 55 నుంచి 60 రోజుల్లో పూర్తి వర్మి కంపోస్ట్ తయారవుతుంది. వర్మీ కంపోస్టు ఎరువు గోధుమ రంగులో వాసన లేకుండా టీ పొడి లాగా కనిపిస్తుంది.
- 2,3 మిల్లీమీటర్ల జల్లెడతో జల్లించి సంచుల్లో నింపి నీడలో నిల్వవుంచుకోవాలి. ఈ వర్మీ కంపోస్ట్‌కు సూడోమోనస్, ట్రైకోడెర్మ విరిడీ లాంటి జీవ సంబంధిత పొడర్లను కలిపితే, వర్మీ కంపోస్ట్‌లోని పోషక విలువలు పెరగడంతో పాటు, పంటలు ఎలాంటి రోగాల బారిన పడవు.
- బెడ్స్ అడుగు భాగంలో ఉన్న వానపాములను ఎరువు నుంచి వేరు చేసి తిరిగి వర్మీ కంపోస్ట్ తయారీకి వాడుకోవచ్చు. ఇలా ఏడాదికి 5 నుంచి 6 సార్లు వర్మికంపోస్ట్ తయారు చేసుకోవచ్చు.

మోతాదు

- వర్మీ కంపోస్ట్‌ను ఎకరాకు 8 నుంచి 12 కిలోల వరకు వివిధ పంటలకు వేసుకోవచ్చు. పండ్ల తోటల్లో అయితే ప్రతీ చెట్టుకు 5 నుంచి 10 కిలోల వరకు వేసుకోవచ్చు.
- ఏడాదికి ఒకటి లేదా రెండుసార్లు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

ఉపయోగాలు..

- నీటిని పట్టి ఉంచే సామర్థ్యం పెరగడం.
- నత్రజని, భాస్వరం ఎరువులతో పాటు 14 రకాల సూక్ష్మ పోషకాలు పంటలకు అందుతాయి.
- వేరే రసాయన ఎరువులు వాడకపోవడం రైతులకు ఖర్చు తగ్గిపోతుంది.
- వ్యాపార సరళిలో వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ద్వారా రైతులు స్వయం ఉపాధిని పొందవచ్చు.

వర్మీ కంపోస్ట్ తయారీ విధానం

భూమి పొరల్లో వుంటూ బొరియలు చేయని వానపాములు వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి అనుకూలం. మన వాతావరణానికి ఐసీనియా పోయి టీడ, పెరియనిక్స్ ఎక్సవేటస్ అనే రెండు రకాల వానపాములు అనువైనవి. ఇవి ఎక్కువ వ్యర్థ పదార్థాలను తింటూ తక్కువ కాలంలోనే కంపోస్ట్‌ను తయారు చేస్తాయి.

వ్యర్థ పదార్థాలు..

మనం పంటలు పండించిన తర్వాత మిగిలిన వ్యర్థ పదార్థాలు గడ్డి, ఆకులు, చెత్త, పశువుల పేడ, పండ్ల తొక్కలు, కూరగాయల వ్యర్థాలు ఇలా సహజంగా దొరికే వ్యవసాయ వ్యర్థాలు అవసరం.

ఇతర అవసరాలు..

వానపాములు సూటిగా ఎండను తట్టుకోలేవు. కాబట్టి వీటి రక్షణకు నీడను ఏర్పాటు చేసుకోవాలి. దీనికి షెడ్లు లేదా గుడిసెలు తయారు చేసుకోవాలి. ఇలా తయారు చేసుకోవడం ద్వారా వానపాములకు నీడను ఇవ్వడమే కాకుండా ఎరువు నుంచి తేమ తొందరగా ఆవిరై పోకుండా కాపాడుకోవచ్చు. ఈ షెడ్డు నీడలో వర్మీ బెడ్స్ వేసుకోవాలి.



వర్మీ కంపోస్ట్ తయారీలో వానపాములు

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

జిల్లావ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగించి అన్నివర్గాలకు సేవలందించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు.

\- సంగారెడ్డి న్యూస్ నెట్‌వర్క్



పటాన్‌చెరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు



జహీరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



రామచంద్రాపురం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్ప, నాయకులు



మనూరు(నారాయణఖేడ్): మనూరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువకులు



పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



హత్నూర: దౌల్తాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమతా సైనిక్ దళ్ నాయకులు



జోగిపేట(అందోల్): అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మునిపల్లి: కంకోల్‌లో..



నారాయణఖేడ్: జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సదాశివపేట పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



కల్హేర్: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు, యువకులు



పటాన్‌చెరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్స్(ఎన్బీఈఎంఎస్), ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్స్ ఫోరమ్ (ఐపీఏ-ఎస్ఎఫ్)ల సంయుక్త సౌజన్యంతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) నిర్వహించాల్సిన ప్రక్రియపై విద్యార్థులకు వర్చువల్‌గా శిక్షణ ఇచ్చారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆన్‌లైన్ సెషన్‌లో గీతం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతం సందర్శన

నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ బిజినెస్ డీన్ రిచర్డ్ బుటిమర్ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నార్త్‌ఫోరిడాలో ఉన్నత విద్య అభ్యసించడానికి కోర్సులు, వాటి వ్యవధి, ఫీజు, చదువుతూనే సంపాదించే అవకాశాలు, కోర్సు పూర్తయ్యాక శిక్షణ, ఉద్యోగావకాశాలు వంటిఅంశాలను వివరించారు. యూఎస్‌లోని ఫీజుల కంటే కెరీర్ అవకాశాలను ఐఎంఎఫ్ఎస్ కన్సల్టెంట్ సంస్థ దక్షిణ భారత డైరెక్టర్ అజయ్‌కుమార్ వివరించారు.

అధికారుల తీరుపై అసహనం

- సమస్యలు పరిష్కరించాలని సభ్యుల డిమాండ్
- అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లోని ప్రజాసమస్యలను పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు నివేదికలను సభకు వివరించారు. వర్షాలు కురుస్తుండటంతో కల్లాల్లోని ధాన్యంను తరలించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఖాజీపల్లి గ్రామంలోని 180 సర్వే నంబర్‌లోని భూమిలో అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారని ఎంపీటీసీ భార్గవ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనుమతులు లేని వెంచర్లు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు, సభ్యుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ సభలో దృష్టికి వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ వెంచర్ల ఏర్పాటు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీఓ రాములు, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సంగప్ప

నారాయణఖేడ్: నియోజకవర్గంలో నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప తెలిపారు. బుధవారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తామన్నారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకొని పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాటానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, ఆయా మండలాల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, నాయకులు కాశీనాథ్, గోపాల్‌రెడ్డి, మహాదేవ్, రాజు, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సునందు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన వ్యక్తిపై అతడి మేనబావ ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన రాములు అతడి బామ్మర్ది సునందు(23) ఇరువురు కలిసి బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని బందంకొమ్ముకు ఐదేళ్ల క్రితం వచ్చి మదినగూడ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన రాములు డ్యూటీకి వెళ్లగా సునందు ఇంటి వద్దే ఉన్నాడు. అదే రోజు సాయంత్రం రాములు ఇంటికి వచ్చి చూసేసరికి సునందు కనిపించక పోవడంతో సునందు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సునంద్ అదృశంపై అతడి మేనబావ రాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

సంగారెడ్డి: ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ గెలుపుతో ఆర్‌టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలంగాణ జాతీయ ముగ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లి కృష్ణమూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ పరిపాలనలో ఒక్క రుపాయి జీతం పెంచకుండా కార్మికుల ఆకలిచావులకు కేసీఆర్ కారకుడుయ్యాడన్నారు. 2019లో 55 రోజులు కార్మికులు సమ్మెలో ఉన్నా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకుండా 40 మంది కార్మికుల చావుకు కారకుడయ్యాడని ధ్వజమెత్తారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో ఆర్టీసీ సంస్థను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఆర్‌టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

భూకబ్జాలపై అధికారుల ఆగ్రహం



కబ్జాలు చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఆర్‌ఐ జయశంకర్ నారాయణ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో 181 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో పలువురు వ్యక్తులు కబ్జాలు చేస్తుండటంతో బుధవారం రెవెన్యూ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయశంకర్ నారాయణ ప్రభుత్వ భూమిని పరిశీలించి అక్కడ పనులు చేస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఆర్‌ఐ తెలిపారు. వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరిపినా సహించేదిలేదని ఆర్‌ఐ హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్సీకి పరామర్శ



భూపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: ఇటీవల ఇంట్లో కిందపడి గాయాలపాలైన మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డిని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బుధవారం భూపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యేక బలగాల విధులు ముగింపు



రామకృష్ణారెడ్డితో పోలీసు బలగాలు, అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికల్లో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 500 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాలు విధులు నిర్వహించాయి. వీరికి జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో కొలన్ రామకృష్ణారెడ్డి ఫంక్షన్ హాలులో 15 రోజుల పాటు సిబ్బందికి కావాల్సిన వసతులను కల్పించేందుకు స్థానిక నాయకుడు రామకృష్ణారెడ్డి చర్యలు చేపట్టారు. బుధవారంతో సిబ్బంది విధులు ముగించటంతో వసతులు కల్పించిన కొలన్ రామకృష్ణారెడ్డిని డీఎస్పీ పురుషోత్తరంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి తనవంతు బాధ్యతగా సాయాన్ని అందించటం సంతోషంగా ఉందని రామకృష్ణారెడ్డి తెలిపారు.